# వెలమర జోగారావు

జూన్ నెల మొదటి వారంలో ఒక నాటి సాయంత్రం, ఆకాశంలో వానమబ్బులు కమ్ముకుంటున్నాయి. గోల్ బజార్‌కు పోయే రోడ్డుకు కుడి పక్క చిన్న పేట ఉంది. ఆ పేటలో నివసించే వాళ్ళంతా రైల్వేలో పనిచేసే నాలుగవ తరగతి కార్మికులు, రిక్షావాళ్ళు, కూలీలు. ఆ పేటకు తూర్పు దిశను ఇరవై గజాల దూరంలో పిచ్చిగాడి సారా దుకాణ ముంది.

దుకాణం ముఖద్వారం వద్ద కర్ర బొగ్గుల కుంపట్లో కబాబులు కాలుస్తున్నా డొక పన్నెండేళ్ళ కుర్రాడు. వాడి పేరు పిట్టు. పిచ్చిగాడు విల్స్ సిగరెట్ కాలుస్తూ గల్లా పెట్టె ముందు కూర్చున్నాడు. ట్రాన్సిస్టర్ 'మైనే పీనే సీఖ్ లియా' పాట పాడుతూంది. గ్లాసులు కడిగే పదేళ్ళ కన్నయ్యగాడు నోటితో తబలా చప్పుడు చేస్తూ పాటకు వంత కలుపుతున్నాడు.

రోడ్ పక్కనే కట్టిన గేదె విప్పుకు పోవడానికి పేట లోపల నుండి వచ్చా డొక ఆసామీ. భూమిలో నిలువుగా పాతిన అడుగు పొడవు గల లావుపాటి ఇనుప ముక్కకు కట్టిన తాటి ముడి విప్పాడు. ఇనుప ముక్క మొన సూదిగా భయంకరంగా పైకి పొడుచుకుని ఉంది. 'పిల్లలెవరైనా ఆడుకుంటూ పొరబాటున దీని మీద పడితే ఎంత ప్రమాదం?' అనుకుంటూ విప్పిన గేదె తోలుకుని పేటలోపలికి వెళ్ళిపోయేడు.

సారా దుకాణాని కెదురుగా వేప చెట్టు క్రింద పిచ్చి ముత్యాలయ్య నిలబడి ఉన్నాడు. వాడి శరీరమంతా మట్టి కొట్టుకుపోయి ఉంది. తైల సంస్కారం ఎరగని జుత్తు జడలు కట్టి ఉంది. చినిగి మాసిపోయిన ఖాకీ నిక్కరు వేసుకుని ఉన్నాడు. శరీరంపై మరొక ఆచ్ఛాదన లేదు. చేతిలో సొత్తలు పడ్డ సత్తు గిన్నె ఉంది.

ముత్యాలయ్య ఆ పేటలో అడుక్కుంటూ దొరికింది తిని, రాత్రిళ్ళు వేప చెట్టు క్రిందనో పేవ్‌మెంట్ మీదనో నిద్ర పోతాడు. ఎవరైనా బేడ డబ్బులు ఇప్పసారా పోస్తే తాగి, ''ఇంక్విలాబ్ జిందాబాద్'' అంటూ అరుస్తూ పేటలో రోడ్‌మీదా తిరుగుతాడు.

ఒకప్పుడతను రైల్వేలో కార్మికుడిగా పనిచేసే వాడు. ఆ పేటలోనే వాడూ, వాడి పెళ్ళాం కాపురం ఉండే వారు. నలుగురి తలలో నాలుకలా మసలే వాళ్ళు. ఇంతలో సమ్మె వచ్చి పడింది. కార్మిక సంఘంతో కలిసి సమ్మెలో పాల్గొన్నాడు. పోలీసుల లాఠీ దెబ్బలు తిన్నాడు. జైలు కెళ్ళాడు. ఉద్యోగం పోయింది. తల మీద తగిలిన దెబ్బల మూలంగా మెదడు కాస్త పాడయింది. జైలునుండి తిరిగొచ్చాక ఉద్యోగంకోసం ప్రయత్నించాడు. దొరకలేదు. కూడబెట్టిన డబ్బంతా ఖర్చయిపోయింది. దారిద్ర్యం చుట్టుబెట్టింది. తరచు సారా త్రాగే వాడు. మైకంలో పిచ్చి కేకలు వేస్తూ బట్టలు చింపుకునే వాడు. పిచ్చి మొగుణ్ణీ, దారిద్ర్యాన్నీ భరించలేక అతని పెళ్ళాం పారిపోయింది. అప్పులాళ్ళు ఆ కాస్త పాకను స్వాధీనం చేసుకుని నిరాశ్రయుడ్ని చేశారు. ఆ నాటి నుండి అతని బ్రతుకు బజారున పడ్డది.

చిన్న చినుకులు పడ నారంభించాయి. చల్లని తేమ గాలి రివ్వున వీచసాగింది.



చెట్టు మానుకు ఆనుకొని ముత్తయ్య గజగజ వణుకుతున్నాడు. వాడి దృష్టి సారా దుకాణం దగ్గర కుంపట్లో కాలుతూన్న మాంసపు ముక్కల మీదుంది అంతసేపూ. వర్షం మొదలవగానే పిట్టూ సరంజామా దుకాణంలోపలికి మార్చాడు.

అప్పుడే రత్తిగాడి గాంగ్ సిబ్బిగాడి దుకాణంలో ప్రవేశించింది. వాళ్ళు మొత్తం ఎనిమిది మంది ఉన్నారు.

"రండి, గురూగారూ! బహుకాల దర్శనం" అంటూ సిబ్బిగాడు వాళ్ళను ఆహ్వానించాడు.

రత్తిగాడి గాంగ్ చిల్లర దొంగతనాలు, వర్కుషాపులో ఇనుము, ఇత్తడి సామానులు కాపలా వారి సాయంతో తస్కరించి అమ్ముకోవడం చేస్తుంటుంది. ఈ రోజెక్కడో మంచి బేరం తగిలినట్టుంది — ఉషారుగా ఉన్నారు.

"చాలా రోజుల నుండి వేసిన ప్లాను సక్సెస్ అయిందిలే. ఇప్పు డిది అడ్వాన్సు పార్టీ అనుకో. అది సరేగానీ నంబర్ వన్ ఉందా?" రత్తిగాడు అడిగాడు.

"ఉందిగానీ చాలా తక్కువ, గురూ! మొవ్వా ( ఇప్పసారా ) లోలడుంది" అన్నాడు సిబ్బిగాడు.

"సరేలే. ఏదుంటే అదే పొయ్ మరి. ఒరేయ్, పిట్టూ! కబాబ్‌లన్నీ కాల్చెయ్!" అన్నాడు రత్తిగాడు.

"ఓ కే గురూ! అన్నీ మీకే రిజర్వ్ అయిపోనాయ్!" హుషారుగా జవాబిచ్చాడు పిట్టూ.

"కన్నయ్యా! ఇంకా నాలుగు గ్లాసులు తేరా!" సిగరెట్టు పారేసి, సీసాలుతీస్తూ అన్నాడు సిబ్బిగాడు.

"ఒరేయ్, కన్నయ్యా! గ్లాసులన్నీ శుభ్రంగా కడుగు. సిబ్బీ! మంచి మాల్ ఇయ్యరా! లేకపోతే నీ పని గోల్‌మాల్ అవుతుంది." నవ్వుతూ అన్నాడు రత్తిగాడు.

"గురూ! నీ కివ్వకపోతే ఇంకెవుడి కిస్తాను?" అంటూ, కన్నయ్య తెచ్చిన గ్లాసులో సీసా మూతలు తీసి సారా వంపాడు. "సెమించు గురూ, మూడే సీసాలు నెంబర్ వన్ ఉన్నాయి."

"ఫర్లేదులే! ఏదయినా మనం సైయే! కన్నయ్యా! బయట నిలబడి చూస్తుండరా! టైమ్ బాగాలేదు. ఠాణాకి కొత్త ఎస్. ఐ. వచ్చాడట" అన్నాడు రత్తిగాడు.

"వర్షంపడుతోంది, తడిసిపోతాను" అంటూ నసిగాడు కన్నయ్య.

"ఎల్లరా! మొక్క మొలవ్వులే. కొంచెం సేపు చూస్తుండరా!" అన్నాడు రత్తిగాడు.

"ఎల్లరా, కన్నయ్యా!" గ్లాసులు అందరి కందిస్తూ అన్నాడు సిబ్బిగాడు. కన్నయ్య వణుకుతుంటూ బయటికెళ్ళాడు.

యజ్ఞం మొదలయింది. అందరూ గ్లాసు లెత్తి గడగడ తాగేశారు, కుంపట్లో మాంసపు ముక్కలు చుర చుర మని కాలుతున్నాయి. కాలిన వాటిని ఆకుల్లో వేసి అందిస్తున్నాడు వాళ్ళకు పిట్టూ. కారం రాసి కాల్చిన మాంసం ముక్కలు వేడిగా, రుచిగా ఉన్నాయి. ఒక్కొక్క ముక్కా నములుతున్నారు. గ్లాసులు నిండుతున్నాయి. ఖాళీ అవుతున్నాయి. గవర్నమెంటు సరుకు అయిపోయింది. మొవ్వా సీసాలు మూతలు తెరుచుకున్నాయి.

"ఒరేయ్! ఆ చెట్టు క్రింద ఎవడ్రా నిలబడి ఉన్నాడు?" రత్తిగా డడిగాడు.

సిబ్బిగాడు అటువేపు చూసి— "వాడా! ముత్తయ్య, గురూ!" అన్నాడు.

రత్తిగాడు చప్పట్లు చరిచి, కేకలు పెట్టి ముత్తయ్యను రమ్మన్నాడు. ముత్తయ్య వాళ్ళవేపు ఒక మారు చూసి ఉదాసీనంగా మొగం తిప్పుకున్నాడు. వాడి నిర్లక్ష్యానికి రత్తిగాడి ఒళ్ళు మండిపోయింది.

"రాఖా! వాళ్ళు వాణ్ణి తీసుకురా! రాకపోతే తన్ని ఈడ్చుకురా!" రత్తిగాడు గాంగ్ మెంబర్లలో ఒకణ్ణి ఆజ్ఞాపించాడు.

రాఖా నామధేయుడు గ్లాసు ఖాళీచేసి నిలబడి నడుముకు కట్టిన బెల్టు తీసి ముందడుగు వేశాడు.

"పోనియ్, గురూ! పిచ్చాడితో మన కేమిటి?" అన్నాడు సిబ్బిగాడు.

"వాడిని తన్నాలని కాదురా పిలిచేది. పాపం పిచ్చోడు కదా ఏదయినా తినడాని కిద్దామని...వాడి గర్వం చూడు" అన్నాడు రత్తిగాడు.

"నేను తినిపించాలా, బాస్!" అడిగాడు రాఖా.

"వద్దు! వాణ్ణి పట్టుకురా!" అన్నాడు రత్తిగాడు. ముత్తయ్య రాఖాను చూసి రానున్న ఆపద గుర్తించి పారిపోబోయాడు. కాని, వాడి ప్రయత్నం ఫలించలేదు. వెంటాడి వాణ్ణి చేతిక్కించుకుని తీసుకొచ్చాడు రాఖా.

"కూర్చో. అక్కడ కూర్చోరా!" అన్నాడు రత్తిగాడు. వాడు భయంగా బెదురుతూ చూస్తున్నాడు.

"ఫర్వాలేదు కూర్చోరా!" అన్నాడు సిబ్బిగాడు, వాడికి ధైర్యానిస్తూ.

"నన్ను కొడతారు" అన్నాడు ముత్తయ్య.

"కొట్టములే. కూర్చో! మధ్యాహ్నం అన్నం తిన్నావా?" అడిగాడు రత్తిగాడు. లేదన్నట్టు తలూపాడు వాడు.

"సారా తాగుతావా?" తను తాగి కొద్దిగా విడిచిన సారాగ్లాసు చూపించి అడిగాడు రత్తిగాడు.

తాగుతా నన్నట్టు తల ఊపాడు వాడు. రత్తిగాడు గ్లా సందించబోయాడు. ముత్తయ్య ఆబగా గ్లాసందుకో బోయాడు. రత్తిగాడు చటుక్కున గ్లాసు వెనక్కి లాక్కుని కాలు సాచి వాణ్ణి తన్నాడు. ఆ తాపుతో వెనక్కి తూలిపడి, లేచి భయంతో పారిపోబోయాడు వాడు.

"కూర్చో, తొత్తుకొడకా!" అంటూ అరిచాడు రత్తిగాడు. వాడు గజగజ వణుకుతూ నేల మీద ముడుచుకుని కూర్చున్నాడు.

"సారా తాగడానికి, తినడానికి మాత్రం పిచ్చోడు కాడు" అంటూ, రత్తిగాడు గ్లాసులో మిగిలిన సారా గొంతులో పోసుకున్నాడు. ఈ వినోదం చూస్తూ వాళ్ళంతా విరగబడి నవ్వారు.


"పిట్టూ! ముత్తయ్యకి ఒక కబాబు ముక్క ఇయ్యి!" చెప్పాడు రత్తిగాడు. కాల్చిన మాంసపు ముక్కను ఆకులో పెట్టి ఇవ్వబోయాడు పిట్టూ. ముత్తయ్య ఈసారి తొందరపడలేదు. మాంసం ముక్కవేపు, రత్తిగాడి మొగం వేపు చూసి నిరాశగా మొగం పెట్టాడు. రత్తిగాడు పకపకా నవ్వాడు. మిగిలిన వాళ్ళు వాణ్ణి అనుసరించారు.

"దెబ్బకు దెయ్యం జడుస్తుంది. తీసుకోరా! తిను. భయం లేదులే" అంటూ బుజ్జగించాడు రత్తిగాడు. అయినా, దాన్ని ముట్టుకోలేదు వాడు. వాడి కళ్ళలోని భీతి ఇంకా తొలగిపోలేదు.

సొట్టలు పడ్డ సత్తు గిన్నెలో మాంసం ముక్క గిరాటేశాడు పిట్టూ.

"ఇంక్విలాబ్ జిందాబాద్!" గాంగ్‌లో ఒకడు అరిచాడు.

"ముత్తయ్య, నీ పెళ్ళాం ఎవడితో పారిపోయింది?" మరొక డడిగాడు. వాళ్ళ



హేళనల్ని లక్ష్యం చెయ్యకుండా, మాంసం ముక్క అందుకుని మెల్లగా చప్పరించ సాగాడు ముత్తయ్య.

"ఏమిటి సంగతి, గురూ! ముత్తయ్య ఈ వేళ డల్‌గా ఉన్నాడే?" అన్నాడొకడు.

రత్తిగాడు కొంచెం సారాయి ముత్తయ్య సత్తు గిన్నెలో పోశాడు. తెనాలి రామలింగని పిల్లి పాలగిన్నె వేపు చూసినట్టు వాడు దాన్ని చూశాడు.

"త్రాగరా. భయం లేదులే" రత్తిగాడు అభయమిచ్చాడు. వాడు ఆ గిన్నె అందుకుని ఎత్తి నోట్లో వంపుకున్నాడా ద్రవాన్ని.

"ఒరే, కన్నయ్యా! ఇలా రా!" రత్తిగాడు బయట కాపలా కాస్తున్న కన్నయ్యను పిలిచాడు. కాపలా డ్యూటీ తప్పినందుకు సంతోషిస్తూ వచ్చాడు కన్నయ్య.

"నాలుగు చపాతీలూ, కూరా పొట్లం కట్టించి తేరా!" అంటూ, రత్తిగాడు అయిదు రూపాయల నోటు కన్నయ్య కిచ్చాడు. మరొక రెండు పది రూపాయల నోట్లు సిబ్బిగాడి కిచ్చాడు. కన్నయ్య రాకెట్‌లా పరుగెత్తాడు అక్కణ్ణించి.

"చపాతీలు ఎందుకు, గురూ?"

"పాపం! మధ్యాహ్నం నుండి ఏమీ తినలేదుగా ముత్తయ్య? వాడికోసమే" అన్నాడు రత్తిగాడు.

"నీది వెన్నపూసలాంటి మనసు, గురో!" అన్నాడు సిబ్బిగాడు.

గ్లాసులు మళ్ళీ నిండాయి. అందరికీ బాగా మత్తెక్కింది. ఈ సారి ముత్తయ్య గిన్నెలో కూడా పోశారు. వర్షంలో చలిలో వెచ్చని సారా గొంతుదాటి పొట్టలో పడగానే ముత్తయ్యకు హుషారు వచ్చింది.

"ఇంక్విలాబ్ జిందాబాద్!" అంటూ, హఠాత్తుగా అరిచాడు ముత్తయ్య. అందరూ ఉలిక్కిపడి వాడి వేపు చూసి విరగబడి నవ్వారు.

"అబ్బో! బండికి జోరెక్కిందే!" అన్నాడు రత్తిగాడు.

ట్రాన్సిస్టర్‌లో "ఝుమ్‌కా గిరారే" పాట వచ్చింది.

"ముత్తయ్యా! డాన్స్ చెయ్యాలి ... డాన్స్!" అంటూ అరిచారు. రత్తిగాడు గ్లాసుడు సారాయి ముత్తయ్య గిన్నెలో పోశాడు. వాడు దాన్ని తాగేసి వాళ్ళ కోర్కెను మన్నించాడు. ఖాళీ గిన్నె నెత్తి మీద బోర్లించుకుని బక్క దేహాన్ని మెలికలు తిప్పుతూ, చేతులు ఊపుతూ విచిత్రంగా నాట్యం చెయ్యసాగాడు. అందరూ వాణ్ణి కిర్రెక్కించారు. పరిహాసాలు చెలరేగాయి. పాట అయిపోయింది.

కన్నయ్యగాడు బజారునుండి రొప్పు:



వర్షపాత ఫోటో—ఎస్. వి. సోమేశ్వరరావు (బొబ్బిలి)

కుంటూ రొజుకుంటూ తిరిగి వచ్చాడు. పొట్లం, చిల్లర డబ్బులు రత్తిగాడి కిచ్చాడు. పొట్లం విప్పి చపాతీల్ని, బంగాళా దుంపల కూరనూ బెంచీ మీద పెట్టాడు. ముత్తయ్య వాటివేపు ఆశగా చూశాడు.

"నీకోసమే లేరా! డాన్స్ అయిపో యిందా?" అడిగాడు రత్తిగాడు.

ట్రాన్సిస్టర్‌లో పాటలు రావడం లేదు. ముత్తయ్య నోటితో చప్పుడు చేస్తూ పిచ్చి పాటలు పాడుతూ గెంతులెయ్య సాగాడు. రత్తిగాడికి వినోదం నచ్చలేదు. ఇంకా కొంచెం వేపు వాణ్ణి ఏడ్పించి గాని ఆ చపాతీలను ఇవ్వదల్చుకోలేదు.

"ముత్తయ్యా! అల్లదిగో, ఆ గోడ కనబడుతోంది. చూడు! పరుగెత్తి కెళ్ళి దాన్ని ముట్టుకుని తిరిగిరావాలి" అన్నాడు రత్తిగాడు. ఆ గోడ పేటకు ఎడమవైపున ఉన్న స్కూలు గోడ.

ముత్తయ్య తల ఊపి పరుగు లంకించుకోబోయాడు.

"అహహ! అలా కాదు. ఆ పాంట్ విప్పేసి మరీ పరుగెత్తుకు పోవాలి."

వాడు అయోమయంగా రత్తిగాడి వేపు, చపాతీల వేపు చూశాడు.

"మరి పందెమంటే అంతే! పది గజాల దూరం ఉన్నా ఆ గోడను తాకి రావాలి. ఊఁ బట్టలు తియ్యి మరి!"

రోడ్డుమీద గొడుగులు వేసుకొని జనం తిరుగుతున్నారు.

ఆకలి వాడి సిగ్గును అణిచివేస్తోంది. అయినా, సాహసించలేక పోతున్నాడు.

"ఏం ముత్తయ్యా, ఆలస్యందేనికి? ఆలోచించకు, ఊఁ త్వరగా!"

"ముత్తయ్యా జిందాబాద్!"

ముత్తయ్యకు ఆవేశ మొచ్చింది. ఉన్మత్తత ఆవరించింది. పంట్లాం విప్పి పారేసి బయటి కొచ్చాడు. వాడి వెనక అందరూ వచ్చారు. హర్షధ్వానాలు చేసి చప్పట్లు చరిచి వాణ్ణి ప్రోత్సహించారు.

ఆకాశం క్రింద చిన్న చిన్న చినుకుల్లో తడుస్తూ, అప్పుడే తల్లి కడుపులో నుం: బయటకు వచ్చిన శిశువులా గున్నాడు వాడు. రోడ్ మీద వచ్చిపోయే జనం ఆ దృశ్యం చూసి నవ్వుతున్నారు. ఒకరిద్దరు ఆడవాళ్ళు ముత్తయ్యనుచూసి సిగ్గుతో తలలు వంచుకుని పమిటలు నోట్లో కుక్కుకుంటూ తొలగిపోయారు.

"వన్! ... టూ! ... త్రీ! ..."

"ఇంక్విలాబ్ జిందాబాద్!" అంటూ వెర్రికేక ఒకటి పెట్టి ముందుకి ఉరికాడు ముత్తయ్య. ఆ వెంటనే కాస్త దూరంలో రోడ్ ప్రక్కన బురదలో కాలుజారి దభేలున ముందుకు తూలి పడ్డాడు. పడిన వాడు మరి లేవలేదు.

"ముత్తయ్యా, లే... కమాన్! హరియప్. లే!" గాంగ్ కేకలు వేస్తోంది. ముత్తయ్య లేవలేదు. గాంగంతా వాడి దగ్గరకు కెళ్ళి చుట్టూ మూగింది. గేదె కట్టేందుకు ఉపయోగించే అదే ఇనుప ముక్క ముత్తయ్య ఛాతీని చీల్చేసింది కాలుజారి ఆ ఇనుప ముక్క మీద బోర్లాపడ్డాడు.

కాలువలు కట్టిన వర్షపు నీట్లో రక్తం మిళితమై ప్రవహిస్తోంది. అంతా నిశ్చేష్టులై చూస్తూ విలబడి పోయారు.

నాలుగు చపాతీలకోసం నగ్నంగా పరుగెత్తే పందెంలో ప్రాణాలు కోల్పోయిన ముత్తయ్యకోసం తెప్పించిన చపాతీల్ని దుకాణం నుండి ఒక కుక్క సంగ్రహించి పారిపోయింది. మనుష్యుల్ని ఏమార్చి కుక్క నాలుగు రొట్టెలు సంపాదించుకో గలిగింది. కాని, మనుషుల చేత ఏమార్చబడి నాలుగు రొట్టెలకోసం జీవితాన్ని కోల్పోయాడు సాటి మనిషి. ముత్తయ్య నగ్న మృతదేహం రక్తం ఓడుతూ బురదలో పడి ఉంది. రత్తిగాడి గాంగ్ పరారీ అయిపోయింది. సిబ్బిగాడి దుకాణం కట్టేసి ఇంటికి వెళ్ళిపోయాడు. ★